ప్రజాశక్తి
శనివారం 25 ఫిబ్రవరి 2023
5
విజయనగరం



మోడల్ కోడ్ పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్

కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి మోడల్ కోడ్ అమలును పర్యవేక్షించడానికి జిల్లాలో మండలానికో ఫ్లైయింగ్ స్క్వాడ్ ను నియమించినట్లు జిల్లాఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రతి మండలంలో మోడల్ కోడ్ అమలును పర్యవేక్షించడానికి హెచ్‌డిటి ఆధ్వర్యంలో ఇఒపిఆర్‌డి, పోలీస్ కానిస్టేబుల్, వీడియో గ్రాఫర్‌తో కూడిన కమిటీలను నియమించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఇఒపిఆర్‌డిలు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ బృందాలు అన్ని గ్రామాలను, వార్డుల్లో సందర్శించి క్షేత్ర స్థాయి సమావేశాలు నిర్వహించి మోడల్ కోడ్ అమలు పై తగు సూచనలను అందించాలన్నారు.

బొబ్బిలిలో నిరసనలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, వామపక్ష నాయకులు

అదానీ కుంభకోణంపై దర్యాప్తు చేయాలి

- కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్ సంస్థలకే లాభం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి
- బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-బొబ్బిలి/విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చి ప్రజలు, కార్మికులు, రైతులకు నష్టం చేకూర్చుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా శుక్రవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన సాగిస్తోందన్నారు. రైతులకు లాభం చేసే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులపై సబ్సిడీ ఎత్తివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీలు ఎత్తి వేయడంతో రైతులపై పెట్టుబడుల భారంగా పెరుగుతుందన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీకి నిధులు కోత పెట్టడం అన్యాయమన్నారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలో బిజెపి కుట్ర పన్నుతుందన్నారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చారన్నారు. బిజెపి విధానాలతో దేశంలో ఉన్న అన్ని వర్గాలకు నష్టం జరుగుతోందని, ప్రజలంతా ఐక్యమై బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మోడీ అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని అదానీ ప్రజల ఆస్తులను దోచేస్తున్నారని విమర్శించారు. హిడెన్ బర్గ్ నివేదికపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. విభజన హామీలను అమలు చేయాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, బలస శ్రీనివాసరావు, ఎస్.గోపాలం, ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న, విద్యార్థి, యువజన సంఘం నాయకులు రవి, సురేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

అదానీ బాగోతంపై కేంద్రం దర్యాప్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కుదిపేసిన హిడెన్ బర్గ్ రిపోర్టు ప్రకారం లక్షల కోట్ల రూపాయలు అదానీకి మోడీ, బిజెపి ప్రభుత్వం అప్పనంగా కట్ట బెట్టిందని, నేడు అదానీ షేర్లు పడిపోయిన ఫలితంగా ఎల్‌ఐసి, స్టేట్ బ్యాంక్ , ఇతర ఆర్థిక సంస్థల్లో ప్రజా ధనానికి నష్టమొచ్చిందని తెలిపారు. అదానీని అరెస్టు చేసి ప్రజాధనాన్ని వసూలు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, బి.రమణ, ఆనంద్, పుణ్యవతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సొంతిళ్లు లేక అవస్థలు పడుతున్నాం.. మహా ప్రభో! అన్నట్టుగా పేదలు ఉంటే.. ధనవంతులతో సమానమైన సదుపాయాలతో ఇళ్లు కట్టించి, ముగ్గులేసి, తాళంచెవులు అప్పగిస్తామంటూ ప్రభుత్వం ఊరిస్తోంది. అంతటితో ఆగలేదు.. పది రోజులపాటు సంబరాలు చేసుకోవాలని గడిచిన జూన్‌లో పిలుపునిచ్చింది. 2022 డిసెంబర్ నాటికి పూర్తిచేసి సంక్రాంతికి అప్పగిస్తామని బీరాలు పలికింది. ఇంకా ఇళ్లూ లేవు. ముగ్గులూ లేవు. తాళం చెవులకూ నోచుకోలేదు. దీంతో లబ్ధిదారుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి.

సంబరాలు సరే ఇళ్లేవి?

- టిడ్కో గృహాల పంపిణీకి మీనమేషాలు
- ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల్లో ఆగ్రహం
- అద్దెలు చెల్లించుకోలేక పేదల అవస్థలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని విజయనగరం నగర పాలక సంస్థ, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 9,536 మందికి టిడ్కో ఇళ్లను గత టిడిపి ప్రభుత్వం మంజూరు చేసింది. వీరంతా తమ వాటా ధనం చెల్లించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 12 వేల దరఖాస్తులు రాగా, 4,160 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 3,776 ఇళ్ల నిర్మాణం గత ప్రభుత్వమే పూర్తిచేసి, లబ్ధిదారులకు అలాట్‌మెంట్ పత్రాలు కూడా అందజేసింది. వీటిలో సారిపల్లిలో 2880, సోనీనగర్‌లో 1280 ఉన్నాయి. ఇళ్ల అప్పగింత విషయంలో అదుగో ఇదుగో.. అంటూ నెట్టుకొచ్చింది. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 720 ఇళ్లు గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టారు. వీటిలో పూర్తయిన 556 ఇళ్లకు లబ్ధిదారులకు గత ప్రభుత్వమే పత్రాలు పంపిణీ చేసింది. నిర్మాణ దశలో ఉన్న మిగిలిన 144 ఇళ్ల నిర్మాణ పనులను వైసిపి అధికారంలోకి వచ్చాక రద్దుచేశారు. బొబ్బిలి మున్సిపాలిటీలో 2481 మంది అర్హులను గుర్తించి, వీరిలో 2448 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక 1680 మందిని గుర్తించారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు అప్పగిస్తామంటూ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. పార్వతీపురం మున్సిపాలిటీలో టిడ్కో ఇళ్లకు 1488 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అడ్డాపుశీల వద్ద స్థలం కేటాయించి నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణం పునాది స్థాయిలో ఉండడంతో వైసిపి ప్రభుత్వం 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదని 720 మందికి ఇళ్లను రద్దు చేసింది. సాలూరు మున్సిపాలిటీలో 1440 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్ల అప్పగింతకు ఈ ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. ఒకానొక దశలో నెల్లిమర్ల వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణ వద్ద ఇళ్లు అప్పగించాలంటూ స్థానికులు మొరపెట్టుకున్నారు. త్వరలో ఇళ్లు అప్పగిస్తామంటూ మంత్రి దాటవేశారు. ఆ తరువాత ఉగాది, దసరా, సంక్రాంతి అంటూ నెట్టుకురావడం తప్ప ఇచ్చేందుకు ముందుకు రాలేదు. గత ఏడాది జూన్‌లో మన జిల్లాలోని సారిపల్లి నుంచే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ టిడ్కో సంబరాలను ప్రారంభించారు. పది రోజుల పాటు లబ్ధిదారులతో బలవంతపు సంబరాలు చేయించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి, భోజనం పెట్టి గృహ ప్రవేశం చేయించే బాధ్యత తీసుకోవాలని మంత్రులు ఎమ్మెల్యేలకు సూచించారు. తీరా ఇళ్లు అప్పగింతకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. మొత్తంగా టిడ్కో ఇళ్లన్నీ గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయినప్పటికీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు చంద్రబాబు సర్కారు తాత్సారం చేసింది. అలాట్‌మెంట్ పత్రాలు ఇచ్చినా ఇళ్లను అప్పగించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి సదుపాయాల కల్పన పేరుతో సాగదీస్తోంది.

ప్రాక్టికల్స్ ఫీజు పేరుతో దోపిడీ

కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ వినతి

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

జిల్లాలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రాక్టికల్ ఫీజు పేరుతో అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సునీల్, ఎన్.నాగభూషణం పేర్కొన్నారు. ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐఒకు శుక్రవారం వినతి అందజేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్‌ఫీజు ప్రభుత్వం ఫీజు నిర్ణయించకపోయినా ధనార్జనే ధ్యేయంగా చేసుకుని జిల్లాలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో రూ.3వేలు నుంచి రూ.3500వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోపోతే ఆందోళన చేపడతామని తెలిపారు.

హైవే పనులకు సంబంధించి మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

హైవే పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

సబ్బవరం- రాయపూర్ మధ్య నిర్మాణంలో ఉన్న 130 సిడి కొత్త జాతీయ రహదారిని, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి శుక్రవారం పరిశీలించారు. హైవేకి సంబంధించిన అంశాలను ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్ కుమార్, కలెక్టర్‌కు మ్యాప్‌ల ద్వారా వివరించారు. ఈ జాతీయ రహదారి జిల్లాలో సుమారు 75 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోందని చెప్పారు. పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని, నిర్ణీత కాలవ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. పనులు జరుగుతున్న తీరుపట్ల కలెక్టర్ సంతప్తిని వ్యక్తం చేశారు. పర్యటనలో ఎన్‌హెచ్‌ఎఐ అధికారులతోపాటు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించే గొంతును గెలిపించండి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

పట్టభద్రుల, ప్రజా సమస్యలపై చట్టసభలో ప్రశ్నించి, పరిష్కారానికి కృషి చేసేందుకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఎంవిపి హెల్త్ ఎరీనాలో ఆమె ప్రచారం చేపట్టారు. పట్టభద్రులతో మాట్లాడారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజలను మాటలతో మోసం చేస్తున్నాయన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నించటం లేదన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మూడున్నరేళ్లుగా ఒక్క నోటిఫికేషనూ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రశ్నించే గొంతుకగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిడిఎఫ్ బృందం ఆర్‌కెఎస్‌వి.కుమార్, రాజేశ్వరరావు, యుఎస్ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, అష్రఫ్, చంటి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పిడిఎఫ్ అంటేనే విద్యావంతుల అభిప్రాయాలను శక్తివంతంగా, స్వతంత్రంగా వినిపించే వేదిక అని, తాజా, మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీల వారసత్వాన్ని కొనసాగిస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని అభ్యర్థించారు.

ఎంవిపి కాలనీలో ప్రచారం చేపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు

పద్మనాభం : మండలంలోని రేవిడి గ్రామంలో పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌టి ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజకుమార హంసను కలిశారు. కాగా ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలో ఐఆర్‌టి ఉపాధ్యాయులంతా పిడిఎఫ్ వెంటే ఉన్నారని, గత ఎన్నికల్లోనూ పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లేశామని, ఈ సారికూడా పిడిఎఫ్‌కు సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రకటించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి..

40 మంది నామినేషన్లు ఆమోదం

నలుగురివి తిరస్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను విశాఖ కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ జైన్ సమక్షంలో అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16న నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి చివరి రోజు గురువారం వరకూ 44 మంది 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ, విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగభారతి నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఈ నెల 27 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. నామినేషన్ల పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉన్నారు.

నామినేషన్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఏజెంట్లు

ముందస్తు చర్యలతోనే ప్రమాదాల నివారణ

- ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

ముందస్తు చర్యల ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని ఆ దిశగా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే చోట్ల హెచ్చరిక బోర్డులు పెట్టాలని, మలుపులు, కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఐరాడ్ సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రమాదాలు జరిగిన వెంటనే సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది స్పందించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జెసి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద గందరగోళంగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు జెసి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి తగిన చర్యలు తీసుకోవాని మున్సిపాలిటీ అధికారులకు సూచించారు.

గుంకలాం పరిధిలో శాటిలైట్ బస్టాండ్ కోసం స్థలం కేటాయించాలని ప్రజా రవాణా అధికారి కోరగా ఆర్‌డిఒకు లేఖ రాయాలని జెసి సూచించారు. ఐనాడ జంక్షన్ వద్ద ఓ ప్రయివేటు కళాశాలకు చెందిన బస్టాప్ రోడ్డుకు దగ్గరగా ఉందని, ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొనగా దాన్ని తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను జేసీ ఆదేశించారు. కొత్తవలస వద్ద ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. ప్రమాదాల నివారణ, రోడ్ల మరమ్మతుల విషయంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్ (ఇన్‌సెట్‌లో), హాజరైన అధికారులు

కలెక్టరేట్ పరిసరాలలో దుకాణాలు తరలించాలి

కలెక్టరేట్ కు సమీపంలో ఎస్. కోట రోడ్డులో చాలా దుకాణాలు రోడ్డు మీదే పెట్టేస్తున్నారని దీని వల్ల ఇబ్బంది కలుగుతుందని జేసీ పేర్కొన్నారు. సంబంధిత దుకాణాల వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపించి వేరే చోటుకు తరలించాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు.

సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వి. సుందర్, ట్రాఫిక్ డిఎస్‌పి మోహన్ రావు, డిఎంహెచ్‌ఒ రమణ కుమారి, పంచాయతీ రాజ్,రహదారుల భవనాల శాఖ ఎస్ఇలు, ఇఇలు, వైద్యారోగ్య శాఖ, పోలీసు శాఖ అధికారులు, ఐరాడ్ విభాగ జిల్లా మేనేజర్ శ్రీధర్, ఎంవిఐ దుర్గాప్రసాద్, జాతీయ రహదారి విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిని శుక్రవారం మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిని బొబ్బిలిలో ప్రారంభించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ చైర్మన్ సావు మురళికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బొబ్బిలిలో ఆసుపత్రిలల్ ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి చైర్మన్ సిహెచ్ విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఏది పడితే అది మాట్లాడొద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోమని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా హెచ్చరించారు. శుక్రవారం ఖాదర్‌బాబా దర్గాను దర్శించుకున్నారు.అనంతరం అశోక్‌బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఐదేళ్లలో కడప, కృష్ణా, అనంతపురంలో ఎన్ని భూములు దోచుకున్నారో తమ వద్ద చిట్టా ఉందన్నారు. ఖాదర్‌బాబా దర్గాలో చంద్ర మహోత్సవానికి ఖాదర్ బాబా ఎంత ఫండ్ రిలీజ్ చేశారో చెప్పాలని అన్నారు. ఎన్ని మసీదులకు కమిటీలు వేశారని ప్రశ్నించారు. ఈ మూడు నెలల్లో ఒక్క రూపాయి అయినా మసీదులకు ఇచ్చారా అని అన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అక్బర్, షమీమ్,ఖాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

26న సంగీత విభావరి

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఈనెల 26న నగరంలోని గురజాడ కళాభారతిలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం .భీష్మారావు, ప్రస్తుత అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి తెలిపారు. శుక్రవారం వారు సంగీత విభవానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కళాతపస్వి కె విశ్వనాథన్ దర్శకత్వంలో వచ్చిన పాటలు, వాణీ జయరాం ఆలపించిన ఆనాటి మధుర గీతాలు సాయి పవన్ సంగీత సారధ్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సినీ రంగానికి ఎంతో విశేషమైన చేయవలసిన వీరి పాటలు నేటి తరానికి ఎంతో అవసరమని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవివి సత్యనారాయణ, ఘంటసాల స్మారక కళాపీఠం సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్యాప్ జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సాయికిరణ్

ఎంవిజిఆర్‌లో ఫ్రీడమ్ ఫెస్ట్

ప్రజాశక్తి-డెంకాడ

చింతలవలస వద్దనున్న ఎంవిజిఆర్ కళాశాలలో స్వేచ్ఛా లెర్నింగ్ సెంటర్ (ఎస్ఎల్‌సి)కు పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో మూడు రోజులపాటు ఫ్రీడమ్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానాన్ని నేర్చుకోవడం, అన్వేషించడం, పంచుకోవడం అనే నినాదంతో ఈ ఫ్రీడమ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. ఫెస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్యాప్ జెమినీ సాఫ్ట్‌వేర్ డెవలపర్ సాయికిరణ్ హాజరయ్యారు. ఫ్రీడమ్ ఫెస్ట్ సిలబస్ ప్రాముఖ్యతపై ఆయన వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్ మాట్లాడుతూ ఇది కేవలం ఏదో చదవడం, వెళ్లడం మాత్రమే కాదని, యువత బృందాలతో కలిసి పనిచేయడం, తమను తాము అన్వేషించడం ద్వారా ఉత్పాదకత పొందే వేదికని పేర్కొన్నారు. డీన్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ స్వేచ్ఛా వంటి అభ్యాస కేంద్రాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఎంవిజిఆర్ ఎస్ఎల్‌సి కన్వీనర్ ఎం.వంశీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సువర్ణకుమార్, ఈవెంట్ కోఆర్డినేటర్ జి.ఫణీంద్ర, ఇతర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో జూనియర్ డాక్టర్లకు శిక్షణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ వైద్య కళాశాలలో మూడు రోజులపాటు జూనియర్ డాక్టర్లకు బేసిక్ లైఫ్ సపోర్ట్ శిక్షణ ఇచ్చారు. అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో 150 మంది వైద్యులు శిక్షణ పొందారు. కళాశాల డీన్ లక్ష్మీకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, అకడమిక్ డైరెక్టర్ వేణుగోపాల్, మెడికల్ డైరెక్టర్ రఘురాం పర్యవేక్షించారు. డాక్టర్ చైతన్య పర్యవేక్షణలో శిక్షణ పొందిన వైద్యులందరికీ ఇండియన్ రిసస్కిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. నైపుణ్య బోధకులుగా వ్యవహరించిన అనస్థీషియా విభాగం ఫ్యాకల్టీని విభాగాధిపతి డివిజి శంకరరావు అభినందించారు.

జూనియర్ డాక్టర్లకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ

ఎస్‌డబ్ల్యుపిసితో ప్రయోజనాలపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వేపాడ, ఆకులసీతంపేట గ్రామ సచివాలయాల్లో సర్పంచులు, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎస్‌డబ్ల్యుపిసిలతో కలిగే ప్రయోజనాలపై ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. గ్రామ వాలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి కేటాయించిన 50 కుటుంబాలతో తడి, పొడి చెత్త వేరు చేయించి, కార్మికులకు అందించేలా చూడాలని సూచించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు. అనంతరం ఆకులసీతంపేట ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేపాడ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, నాయకులు కె.బంగారమ్మ, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, వీణ ఈశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ నిర్మల

సింగవరంలో పొలంబడి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరం గ్రామంలో మొక్కజొన్న పంటలో శుక్రవారం వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని ఎఒ పి.నిర్మల ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎఒ నిర్మల మాట్లాడుతూ ఎరువులు, పురుగుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కత్తెర పురుగు ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఎఇఒ బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

'సంగమేశ్వర' హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని సంగాంలో సంగమేశ్వర ఆలయ హుండీని శుక్రవారం లెక్కింపు చేపట్టారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు సంగమేశ్వర ఆలయం వద్ద జాతర జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి వెళ్లే యాత్రికుల శీఘ్ర దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.2.88 లక్షలు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1.42 లక్షలు, హుండీ ద్వారా రూ.90,9,34... మొత్తం రూ.5,21,214 ఆదాయం వచ్చినట్లు ఇఒ పొన్నాడ శ్యామలరావు వెల్లడించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, అర్చకులు సిద్ధాంతం గణపతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మెరకముడిదాం మండల సమావేశం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మెరకముడిదాం మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపిపి తాడ్డి క్రిష్ణవేణి ఆధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

భోజరాజపురం ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రం నుంచి మున్సిపాలిటీకి సరఫరా అయ్యే పైపులైన్ లీకులను నివారించేందుకు మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. దీంతో శని, ఆదివారాల్లో పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల పాత పైపులైన్ తీసివేసి నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పనులు పూర్తి అయిన వెంటనే తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని, తాగునీటి సరఫరా అంతరాయనికి ప్రజలు సహకరించాలని కోరారు.

కుక్కలు బాబోయ్!

తెలుగు రాష్ట్రమైన హైదరాబాద్‌లో నడిచి వెళ్తున్న నాలుగేళ్ల బాలుడిని వీధి కుక్కలు పీక్కు తిని చంపేసిన ఘటన జిల్లా వాసులను గగుర్పాటుకు గురిచేసింది. నగరంలో విచ్చల విడిగా స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలను చూసి ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నగరంలోని పలు వార్డుల్లో ప్రతిరోజు వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గతంలో తోటపాలెం, దాసన్నపేట తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు మూకుమ్మడి దాడి చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనలు ఉన్నాయి.

- వీధుల్లో స్వైర విహారం
- మేల్కోకుంటే ప్రమాదం
- నియంత్రణా చర్యలు శూన్యం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలో 2015లో ఐదువేల కుక్కలు ఉంటే నియంత్రణ చర్యలు లేకపోవడం వల్ల వాటి సంఖ్య సుమారు 25వేలకు పెరిగిందని ఉందని ప్రజారోగ్య సిబ్బంది చెబుతున్నారు. 2015లో ఒక సారి, 2019 లో ఒకసారి కుక్కలకు ఆపరేషన్లు, కొన్ని కుక్కలను పట్టుకొని అడవుల్లో వదిలేసే విధంగా చర్యలు చేపట్టారు .ఆ తర్వాత నుంచి ఎటువంటి చర్యలు లేకపోవడం వలన వాటి సంఖ్య భారీగా పెరిగింది. దీంతో నగరంలో ఏ వీధికి వెళ్లినా, ఏ ప్రధాన రహదారిలోనైనా కుక్కలు కనిపిస్తూ భయపెడుతున్నాయి.

రాజీవ్ స్టేడియం వద్ద సంచరిస్తున్న కుక్కల గుంపు

ప్రధాన రహదారుల సెంటర్లలో కుక్కలు పాదచారుల వెంట పడి మరీ కరుస్తున్నాయి. మొరిగే కుక్క కరవదు అంటారు. కానీ మొరగని కుక్కలే కాదు మొరగేవి సైతం కూడా పిక్కల పట్టుకొని పీకుతున్నాయి శునకాల గుంపుతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల గుంపులను చూసి గడగడలాడి పోతున్నారు.. రాత్రి, పగలు అని తేడా లేకుండా వెంటపడి మరీ కరుస్తున్నాయి. పాదచారులనే కాదు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలటం లేదు. శునకాల దెబ్బకు ఇంటి నుండి బయటకు రావాలంటే రాత్రి పూట భయపడే పరిస్థితి అనేక వీధుల్లో నెలకొంది. ఉదయం ఇంటింటికీ పేపర్ వేసే వారు కూడా కుక్కలు కారణంగా 7 గంటలు సమయంలో పేపరు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. వీటి నియంత్రణకు స్పందనలో కమిషనర్‌కి వినతి పత్రాలు అందించినా ఫలితం లేకుండా పోతోంది. జంతు పరిరక్షణ చట్టం వల్ల వీధి కుక్కల సంఖ్య పెరిగి వాటి వీర విహారం కూడా పెరిగిపోయింది. గతంలో కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం వీటి నియంత్రణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

రూ.40 లక్షలు వృథా..

విజయనగరం నగర పాలక సంస్థలో కుక్కల నియంత్రణలో భాగంగా.రూ.40 లక్షలతో నిర్మించిన కేంద్రాలు వృథాగా పడి ఉన్నాయి. అవి శిథిలావస్థకు చేరి పూర్తిగా ఉపయోగానికి లేకుండా ఉన్నాయి. నగరంలో 2015 తర్వాత అప్పటి తెలుగుదేశం పాలక వర్గం పాలనుపత్రి వెనుక భాగంలో రూ.20 లక్షలతోను, కొత్త పేట వద్ద మరో 20 లక్షలతోను కుక్కల నియంత్రణ కేంద్రాలు నిర్మించింది. వాటిని నిర్మించారే తప్ప ఏనాడూ ఉపయోగించిన పరిస్థితి లేదు. చివరకు ఇవి పారిశుధ్య పనుల సామాగ్రి దాచుకునేందుకు స్టోరేజ్ రూములుగా ఉపయోగపడుతున్నాయి. 2105లో ఆపరేషన్లు చేసినప్పటికీ ఆపరేషన్లు వికటించడంతో కుక్కలు అనేక రోగాలకు గురయ్యాయి. 2019 లో నియంత్రణ చర్యలు చేపట్టినా కుక్కలను పట్టుకొని దూరంగా విడిచిపెట్టేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకులు వీధి కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బాలుడి చేతిపై కుక్కగాటు

ముగ్గురు చిన్నారులపై దాడి

పార్వతీపురంరూరల్: జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంతో పాటు మండలంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, వీటి బారిన పడుతున్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డుకు చెందిన గౌడువీధిలో ఒకేసారి ముగ్గురు చిన్నారులపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచగా, వెంటనే జిల్లా అసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అటు పార్వతీపురం మండలంలోని నరిసిపురం, వెంకంపేట, తాళ్లబురిడి, పెదబొండపల్లి గ్రామాల్లోనూ వీటి బారిన పడి తీవ్రంగా గాయపడిన వారు ఎందరో ఉండగా, కొన్ని గ్రామాల్లో ఏకంగా మేకల మ oదలపై దాడి చేసిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. వీటిని నిరోధించాల్సిన స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ, పంచాయితీలపై ప్రభుత్వం మార్గదర్శకాలు కఠినంగా ఉండడంతో నిరోధించలేక చేతులెత్తేస్తున్నారు. ఊరవతలకు వెళ్తే ఏనుగులు, పులులు సమస్యలతో పాటుగా ఊరిలోపల ఈఊరకుక్కల విజృంభణ ప్రజల పాలిట కంటకంగా మారాయి. ఈ విషయమై జిల్లా అధికారులు స్పందించి వీటి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని, అలాగే జిల్లా ఆసుపత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ నిరోధ ఇంజెక్షనులు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలులో అధికారులు విఫలం

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి-వంగర

రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ చర్చలో వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పలు గ్రామాల్లో ఇప్పటికీ రైతుల దగ్గర ధాన్యం ఉండిపోయాయని చెప్పారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక ఆవేదన వ్యక్తంచేస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిపి సురేష్ స్పందిస్తూ ఈ విషయంపై ఇప్పటికే జిల్లా అధికారులతో మాట్లాడామని, మండలంలో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేపట్టాలని కోరామని తెలిపారు. మండలానికి ప్రస్తుతం ఉన్న లక్ష్యంలో శివ్వాం, తలగాం, వివిఆర్ పేట, మడ్డువలస జగన్నాథవలస గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శ్రీకాకుళం డిసిసిబి జనరల్ మేనేజర్ ఎస్.రమేష్ మాట్లాడుతూ శివ్వాం పిఎసిఎస్ ద్వారా రుణాలు మంజూరు చేసినప్పటికీ రికవరీలో వెనుకంజలో ఉన్నట్లు తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ సిఇఒ బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేదంటే ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఇఒపిఆర్‌డి ఎల్.త్రినాథరావును ప్రశ్నించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నాయని, ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే ముందుగా వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. పశువైద్య శాఖకు సంబంధించిన చర్చ తూతూ మంత్రంగా సాగింది. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఐజాక్, ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాథరావు, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, తెంటు కుమారి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారిని నిలదీస్తున్న సభ్యులు

మడ్డువలసలో చేపల వేటపై ఆంక్షలు

రూ.21 లక్షల బకాయిలు ఉండడంతో నోటీసులు జారీ

ప్రజాశక్తి-వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములునాయుడు వడ్డువలస ప్రాజెక్టులో చేపల వేటపై అధికారులు ఆంక్షలు విధించారు. ఈ విషయాన్ని రాజాం మత్స్యశాఖాధికారి సిహెచ్‌వి ప్రసాద్ శుక్రవారం వెల్లడించారు. చేపల వేట నిషేధంపై తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐలకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. మడ్డువలస ప్రాజెక్టు పరిధిలో కొట్టేశ శ్రీ సీతారామ స్వదేశీ మత్స్యకార సహకార సంఘం సభ్యులు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 1428, 1431 సఫలీ సొమ్ము ఇంతవరకు ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో ప్రాజెక్టులో చేపల వేట నిషేధించామని ఆయన వెల్లడించారు. సొమ్ము చెల్లించేంతవరకు ఎవరూ మడ్డువలస ప్రాజెక్టులో చేపలు వేట చేయొద్దని సూచించారు.

జాతరకు సిద్ధమైన యల్లారమ్మ ఆలయం

యల్లారమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - జామి

ఆది, సోమ, మంగళవారాల్లో జరగబోయే యల్లారమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారి ప్రసాద్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన యల్లారమ్మ జాతరకు ఈ ఏడాది సందర్శకుల తాకిడి పెరుగుతుందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. పండుగ నిర్వహనకు సంబంధించిన ఖర్చంతా దేవాదాయ శాఖ నుంచి పెడుతున్నామని అన్నారు. బారికేడ్లు మొదలుకొని టెంట్లు, చలివేంద్రాలు, ప్రసాదాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉచిత క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతరకు వచ్చేభక్తులకు అసౌకర్యం జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వైసిపిలో గ్రూపుల పోరు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలో అధికార పార్టీలో రోజురోజుకూ గ్రూపు రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నాయకుల మధ్య ఐక్యత లోపించడం, తమ మాటే నెగ్గాలనే పంతానికి పోవడంతో గ్రూపులుగా వీడి పెత్తనం కొనసాగిస్తున్నారు. వీరిని సమన్వయ పరచడంలో జిల్లా నాయకత్వం విఫలమైందని చెప్పక తప్పదు. ప్రజాప్రతినిధులుగా అధికారం చేపట్టిన వారిని పక్కన పెట్టి, వైసిపి నాయకులు కూరాకుల సూర్యారావు కనుసన్నల్లోనే మండల పాలన సాగుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారులు సైతం ఆయననే అనుసరిస్తున్నారనే చర్చ సాగుతోంది.

గతేడాది నవంబర్ 29న ఎంపిపి గేదెల శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో వైసిపి నాయకులు కూరాకుల సూర్యారావు ఫొటో లేదు. వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఏ ఫ్లెక్సీలోనూ ఆయన ఫొటో కనిపించలేదు. అయినప్పటికీ జిల్లా పెద్దలు సూర్యారావు మాటే వింటున్నారని పలువురి భావన. ఇటీవల జరిగిన జెసిఎస్ కన్వీనర్ల నియామకంలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల మాటలు బేఖాతరు చేస్తూ ఎవరి ఇష్టానుసారంగా వారు నియామకాలు చేపట్టారు. ఈ విషయంలో అసహనానికి గురైన ప్రజాప్రతినిధులు పార్టీని వీడతారనే భయంతో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు వారిని పిలిపించి చర్చించినట్టు తెలిసింది. అయినప్పటికీ ఐక్యత లేకుండా ఎవరి దారి వారిదే అన్న చందాన వ్యవహరిస్తున్నారు.

ఇటీవల కాలంలో ఎంపిడిఒ కార్యాలయంలో జెడ్‌పిటిసి సభ్యులు తూర్పాటి వరలక్ష్మికి కార్యాలయం కోసం ఒక గది కేటాయించాలని సూర్యారావు గ్రూపు అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ పంచాయితీ జిల్లా నాయకత్వం వరకు చేరింది. ఒక గ్రూపునకు చెందిన పార్టీ ఫ్లెక్సీలు భద్రంగా ఉండి ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్)కు చెందిన ఫ్లెక్సీలను ఇటీవల చించివేయడం, గత నెల 24న రంగరాయపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంతపేట ఎంపిటిసి సత్యవతి, ఆమె భర్త జగ్గన్నదొరపై దౌర్జన్యంగా మరో గ్రూపు వారు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో చేయి చేసుకొని, తోసివేయడం... కొన్ని కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం వంటి సంఘటనలు వీరి ఐక్యత పట్ల ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జిల్లా నాయకత్వం గ్రూపుల పోరును చల్లారుస్తుందా? దగ్గరుండి మంట కాగుతుందా? వేచి చూడాలి.



26న ఎపిటిఎఫ్ ప్లాటినం జూబ్లీ మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ ప్లాటినం జూబ్లీ మహాసభ ఈనెల 26న తిరుపతిలోని బైరాగి పట్టిడలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారి బాబు, పాలతేరు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిటిఎఫ్ అధికార ఉద్యమ పత్రిక ఉపాధ్యాయ ఈఏడాది ఫిబ్రవరికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం యావత్ ఉపాధ్యాయ లోకం గర్వపడే విషయమని పేర్కొన్నారు. 1947 ఏప్రిల్ లో గుంటూరులో చెన్నుపాటి లక్ష్మయ్య ఫెడరేషన్ పునరుద్ధరించిన పరిస్థితులలో ఉద్యమ వాణి వినిపించడానికి ఈ ఉపాధ్యాయ పత్రిక ఏర్పాటైందని తెలిపారు. అలాంటి ఘన చరిత్ర గల ఉపాధ్యాయ పత్రిక జూబ్లీ ఉత్సవాలు తిరుపతి పట్టణంలో జరుగుతున్నందున ఉపాధ్యాయులు ,రచయితలు, మేధావులు, విద్యారంగ నిపుణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీల విజేత సంతకవిటి

విజేత సంతకవిటి జట్టుకు బహుమతులు అందజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కొమిరి గ్రామంలో షిరిడిసాయి ఆలయ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలలో సంతకవిటి జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. మొత్తం 34 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్లో పొగిరి జట్టుపై సంతకవిటి విజయనగరం సాధించింది. రన్నర్‌గా పొగిరి, మూడు, నాలుగో స్థానాల్లో నూకలవాడ, తెట్టంగి జట్లు నిలిచాయి. సంతకవిటి జట్టుకు షీల్డ్, రూ.20,116 నగదు బహుమతి అందించారు. పొగిరి జట్టుకు రూ.10,116, నూకలవాడు జట్టుకు రూ.7,516, తెట్టంగి జట్టుకు రూ.5,116 నగదు బహుమతులను గ్రామ నాయకులు భాస్కరరావు, జగన్మోహన్రావు, వావిలపల్లి కృష్ణమోహన్, యూత్ సభ్యులు అందజేశారు. పోటీలకు రిఫరీగా కురిటి హరిబాబు, బి.వెంకటరమణ, రామచంద్రుడు, ఆదినారాయణ వ్యవహరించారు. బొత్స రమేష్ నాయుడు, కర్రి తిరుపతినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా ఫర్మాన్

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కొత్తవలస

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎస్ఇబి ఎఎస్‌పి అస్మా ఫర్మాన్ సూచించారు. స్థానిక ఎపి మోడల్ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపల్ పి.శివప్రసాద్ అధ్యక్షతన యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ పరిసర ప్రాంతాల్లో, విద్యాసంస్థల్లో మందు, బీడీ, సిగరెట్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14500కు ఫోన్ చేయాలని తెలిపారు.

ప్రతి విద్యార్థి మంచిని ప్రేమించి చెడుని విస్మరించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు శృతి, సిఐ బాల సూర్యారావు, ఎస్ఐ దేవి, ఎస్ఇబి ఎస్ఐ నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో శుక్రవారం పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు ఘన వీడ్కోలు పలికారు. ప్రిన్సిపల్ యు.వి.రాణి మాట్లాడుతూ పరీక్షలంటే భయం వీడాలని సూచించారు. నిర్భయంగా రాస్తేనే మంచి ఫలితాలు సాధిస్తారని విద్యార్థుల్లో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గురుకుల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

రోడ్డు భద్రతపై అవగాహన

సీతంపేట: మండలంలో ఐటిడిఎ జంక్షన్ వద్ద విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఎస్సై ఎ.నీలకంఠరావు శుక్రవారం అవగాహన కల్పించారు. మైనర్ బాలురులు వాహనాలు నడపరాదన్నారు. మితిమీరి వేగం వెళ్లరాదని ఓవర్ లోడ్ వేయరాదని అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.